# అందరు బదులు చెప్పవలసిన ప్రశ్న

## చదువుటకు నియమించినవి #38

VII. ప్రభువు పరిచర్యలో చివరి వారం (కొనసాగింది).
  H. శుక్రవారం : యేసు మరణ దినం (కొనసాగింది).
    7. రోమీయులచే తీర్పు (కొనసాగింది):
      బి. రెండవ అంచె: అంతిప హేరోదు ఎదుట (దోషము కాన రాలేదు) (లూకా 23:8-12).
      సి. మూడవ అంచె: పిలాతు ఎదుట (మరణ శిక్ష విధింపబడింది) (మత్తయి 27:15-31; మార్కు 15:6-20; లూకా 23:13-25; యోహాను 18:39-19:16).

## పరిచయం

గత పాఠంలో క్రీస్తు తీర్పు తీర్చబడడం చదువుతూ "యేసుతో నేను ఏమి చేతును?" అనే దానిని నొక్కి చూచాం (మత్తయి 27:22 చూడు). అందులో రెండు పక్షాల వాదాన్ని చూచాం: "నేనాయనను ఎరుగనంటా" అని పేతురు తెలిపాడు! సన్‌హెడ్రినేమో "మేమాయనపై తప్పు మోపుతాం" అని బదులిచ్చారు! "నేనాయనను విడిచి పెడతాను!" అనే ప్రశ్నతో పిలాతు సతమతమయ్యాడు. అతడు అలా చేస్తే వచ్చే రాజకీయ పరిణామాలకు అతడు భయపడ్డాడు. ఇప్పుడు మనం రెండవ భాగాన్ని చదువబోతున్నాం. "యేసుతో నేనేమి చేతును?" అనే ప్రశ్నకు యితరులు యిచ్చిన జవాబులను గుర్తించుదాం. పిలాతు చివరి జవాబును కూడ మనం చూద్దాం.

## హేరోదు: "నేను కేవలం కుతూహలపడతాను" (లూకా 23:5-11)

మన గత పాఠం ముగింపులో, తన సందిగ్ధావస్థకు పరిష్కారం దొరికినట్టు పిలాతు అనుకున్నాడు. యేసు గలిలయవాడని అతడు విన్నాడు (5, 6 వచనాలు). అది అంతిప హేరోదు ఏలుబడిలోని భాగమైయుండింది. "పిలాతు ఆయనను హేరోదు నొద్దకు పంపాడు. ఆ దినములలో హేరోదు యెరూషలేములో ఉన్నాడు"[1] (7 వ.). క్రీస్తును హేరోదు నొద్దకు పంపడంలో, రెండు రకాలైన ఉద్దేశాలను నెరవేర్చుకోవాలని పిలాతు

ఉద్దేశించి యుంటాడు: వేధిస్తున్న సమస్యను పరిష్కరించదలచాడు, అంతేగాక, హేరోదుకును తనకును మధ్య సంబంధాలు మెరుగు పరచుకోవాలని కూడ తలంచి యుండవచ్చు (23:12 చూడు).[2]

రోమా సైనికులు క్రీస్తును హేరోదు నొద్దకు నడిపించారు.[3] వెనువెంట పెద్ద అడుగులు వేసికొంటూ, ప్రధాన యాజకులును శాస్త్రులును వెళ్లారు (10 వ.). ఆ ఊరేగింపు హేరోదు నివాసమైన రాజ భవనం దగ్గరకు చేరుకున్నప్పుడు, "హేరోదు యేసును చూచి మిక్కిలి సంతోషించెను (8 వ.). ఆయనను గూర్చి చాల సంగతులు విన్నందున ...; బహు కాలము నుండి ఆయనను చూడగోరెను" (మత్తయి 14:1; లూకా 9:7-9). హేరోదుకు ప్రభువును దర్శించాలని కాని, అతని బోధను వినాలని కాని ఉద్దేశం లేదు: కేవలం అతడు కుతూహలాన్ని చూపాడు. అతని కుతూహలాన్ని తీర్చే కోర్కె క్రీస్తుకు లేనేలేదు (మత్తయి 7:6 చూడు). హేరోదు ఆయనను ప్రశ్నింపగా, "ఆయన అతనికి ఉత్తరమేమియు ఇయ్యలేదు" (లూకా 23:9; యెషయా 53:7 చూడు). మేజిక్ షోతో ఉల్లాసం పొందాలని రాజు ఎదురు చూచాడు (లూకా 23:8బి) – అయితే అడిగినప్పుడు అద్భుతాలు చేసే అలవాటు క్రీస్తుకు లేదు (మత్తయి 12:38, 39; 16:1, 4లను చూడు). ఆయన "సూచక క్రియల" వెనుక తీక్షణమైన ఉద్దేశముంది.

క్రీస్తు తన యిష్ట ప్రకారం ఆడనందున,[4] హేరోదు తన సొంత వినోదాన్ని రూపించుకున్నాడు. త్వరలోనే సర్కస్‌వంటి వాతావరణం నెలకొంది. ఒకవైపు ప్రధాన యాజకులు, శాస్త్రులు ఉన్నారు. వీరు బిగ్గరగా నిందారోపణలు చేయసాగారు (లూకా 23:10). హాలు మధ్యలో క్రీస్తు ప్రభువు నిలిచున్నారు; ఆయనకు విదూషకునిలాంటి వస్త్రాలు తొడిగారు,[5] తమాషాచేస్తూ రాజును సైనికులును ఆయన చుట్టు నాట్యమాడారు (లూకా 23:11ఎ).[6] పిల్లకాయల ఆటతో అలసినవాడై, హేరోదు చివరికి ఆయనను "పిలాతునొద్దకు మరల పంపెను" (లూకా 23:11బి).

విషాదమేమిటంటే, హేరోదు వలెనే నేడుకొందరికి క్రీస్తు అంటే గాఢమైన అభిలాషలేదు. అట్టివారు, క్రీస్తు నందు కేవలం కుతూహలాన్ని కనుపరచుతారు. ఆయనను గూర్చిన చర్చ పైపైననే నిలిపినంతవరకు, వారు ఎక్కువ సంగతులు తెలిసికొన (నేర్చుకొన) యిష్టముగలవారై యుంటారు. అయితే ఆయన నిజంగా ఎవరై యున్నారో కనుగొడానికి గాను సువార్త రచనలను వారెన్నడు సీరియస్‌గా పఠించినవారు కారు. అందునుబట్టి, వారెన్నడును ఆయనను దేవుని కుమారునిగా అంగీకరింపరు సరిగదా, వారి జీవితాలను సహా ఆయనకు సమర్పణ చేయరు. "కుతూహలం పిల్లిని చంపింది" అనే పూర్వ సామెత ఒకటుంది. క్రీస్తునందు ఒకడు అధికంగా ఆసక్తిని కేంద్రీకరించనంతవరకు అది వాని ఆత్మను కూడ చంపుతుంది.

## అల్లరి మూక: "మేమతని సిలువవేతుము"
## (మత్తయి 27:15-23; మార్కు 15:6-14;
## లూకా 23:12-23; యోహాను 18:39-19:12)

హేరోదునొద్దకు క్రీస్తును పంపడంవలన పిలాతు ఒక ఉద్దేశాన్ని సఫలం చేసికొన్నాడు: రాజుతో అతడు తన సంబంధాన్ని మెరుగు పరచుకొన్నాడు (లూకా 23:12). అయినా, రెండవదాన్ని అతడు సాధించలేక పోయాడు: యేసు విషయంలో ఏ సంగతి తేల్చవలసిన బాధ్యత యింకను అతని నెత్తిమీదనే ఉంది. ఆయనను విడుదల చేయడానికి అధిపతి మరోసారి ప్రయత్నించాడు.

> అంతట పిలాతు ప్రధానయాజకులను అధికారులను ప్రజలను పిలిపించి-ప్రజలు తిరుగబడునట్లు చేయుచున్నాడని మీరీమనుష్యుని నాయొద్దకు తెచ్చితిరే. ఇదుగో నేను మీయెదుట ఇతనిని విమర్శింపగా మీరితని మీద మోపిన నేరములలో ఒక్కటైనను నాకు కనబడలేదు; హేరోదునకు కూడ కనబడలేదు.[7] హేరోదు అతని మాయొద్దకు తిరిగి పంపెను గదా; ఇదిగో మరణమునకు తగినదేదియు ఇతడు చేయలేదు, కాబట్టి నేనితనిని శిక్షించి విడుదల చేయుదునని వారితో చెప్పగా (లూకా 23:13-16).

క్రీస్తు నిర్దోషియని పిలాతు రెండవమారు ప్రకటించాడు. ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతుంది: ఆయన "నిర్దోషియని" పిలాతు కనుగొనినప్పుడు, శిక్షింతునని ఎందుకు ప్రతిపాదిస్తున్నాడు? క్రీస్తును కొరడాలతో కొట్టించడం ద్వారా ప్రజలను ఊరడించగలనని గవర్నరు తలంచుతున్నట్టున్నాడు. ఆలాగున ఆయనను విడుదల చేయవచ్చునని భావిస్తున్న ట్టున్నాడు (లూకా 23:16; 22 వచనం కూడ). లూకా 23:16లో "శిక్షింతు"నని తర్జుమా చేయబడిన పదం "ఉపదేశించు లేక తర్ఫీదు చేయు" అనే ప్రాథమిక భావం కలిగియుంది.[8] యూదా మతనాయకులకు పిలాతు ఏమి చెప్పాడంటే, "ఈ మనిషికి నేనొక పాఠం నేర్పుతాను!" అన్నట్టున్నాడు (AB చూడు).

"పాఠం" నేర్పించే "పాఠశాలగది" కొరడాలతో కొట్టే గది (యోహాను 19:1; మత్తయి 27:26; మార్కు 15:15).[9] రోమా కొరడా దెబ్బలను గూర్చి J. W. Shephard ఈ క్రింది వర్ణననిచ్చాడు:

> కొరడా చివర పలు తోలు వారులతో కూడియుంటుంది. ప్రతివారును సింధూర విత్తనపు ఆకారంలో గుండ్లు లేదా సీసముతో పొదగబడుతుంది లేదా మొనలు దీసిన ఎముకముక్కలు లేదా మేకులు గాని అమర్చబడతాయి. ఆయన బట్టలు విప్పి, ఒక స్తంభానికి గాని కొయ్యకుగాని ఆయన చేతులు కట్టివేసి, తన వీపును వంగదీసి, ఆపదకు గురిచేయబడినవ్యక్తిని ఆ కొరడాలతో ఆరుగురు కొడతారు. ఖైదీ దాదాపుగా మరణించేలా తీక్షణంగా (తీవ్రంగా) హింస కలిగించే ఆ ఆయుధాన్ని వినియోగిస్తారు. ప్రతిదెబ్బ వణకుతున్న చర్మాన్ని చీల్చి రక్తనాళాలు కొన్నిసార్లు వెలుపలికి కన్పించేలా చేస్తుంది. తరచుగా కొరడా దెబ్బ ముఖం మీద తగిలితే కన్నులు పండ్లు ఊడిపోతాయి కూడ. కొరడాలతో కొట్టడం ఎల్లప్పుడు దాదాపుగా స్పృహతప్పి పడిపోవడంతోనో

కొన్ని సార్లు మరణంతోనో అంతమౌతుంది.[10]

ఈ విధంగా క్రీస్తు "శిక్షింపబడ్డారు." అది చాలదన్నట్టు, కొట్టినవారి చేతనే ఆయన అపహాస్యం చేయబడ్డారు. ఆ సైనికులు "ముండ్లతో కిరీటమును అల్లి[11] ఆయన తలమీద పెట్టి ఊదారంగు వస్త్రము[12] ఆయనకు తొడిగించి; ఆయన యొద్దకు వచ్చి 'యూదుల రాజా, శుభమని' చెప్పి ఆయనను అరచేతులతో కొట్టిరి" (యోహాను 19:2, 3; మత్తయి 20:19).

తాను అనుభవించిన బాధల ఫలితాన్ని ఆ మనుష్యుని శత్రువులు చూచినట్టయితే, "అది తప్పక వారిని ఓదార్చుతుందని పిలాతు అనుకొని యుండవచ్చు!" పిలాతు మరల వెలుపలికి వచ్చి "ఇదిగో ఈయన యందు ఏ దోషమును నాకు కనబడలేదని మీకు తెలియునట్టు ఈయనను మీయొద్దకు వెలుపలికి తీసికొని వచ్చుచున్నానని వారితో అనెను" (యోహాను 19:4ఎ). యేసు జనసమూహము ఎదుటికి తేబడ్డారు, ఆయన తలమీద ముండ్లమకుటముంది (యోహాను 19:5ఎ); తన నుదుటిని గుచ్చుతున్న ముండ్లవలన ఆయన మోముపైన రక్తము ధారలుగా కారుతుంది. ఆయన వెనుక చీల్చబడిన వీపునుండి మరకలుపడిన అంగీ. క్రీస్తు వైపుచూచి "పిలాతు – **ఇదిగో ఈ మనుష్యుడు!"** అని వారితో చెప్పెను (యోహాను 19:5సి).[13]

యూదుల రక్త దాహము క్రీస్తును కొరడాలతో కొట్టడంతో తృప్తి తీరుతుందని పిలాతు తలంచియుంటే, అతడు నిరాశకు లోనవుతాడు. ఎందుకంటె, "ప్రధాన యాజకులును బంట్రౌతులును ఆయనను చూచి" – "సిలువ వేయుము సిలువ వేయుము" అని కేకలు వేశారు (యోహాను 19:6ఎ). విసిగిపోయిన పిలాతు – "ఈయనను సిలువవేయాలని అంతగా తీర్మానించుకున్న వారైతే, మీరే సిలువ వేయుడి, – ఎందుకంటె **ఈ మనుష్యుని** యందు నాకు ఏ దోషము కానరాలేదని అన్నట్టున్నాడు"[14] (యోహాను 19:6బి). అతని స్వరములో పరిహాసము ఉండవచ్చు. సిలువేసే పనిని రోమీయులు యూదులకు అప్పగించారని అతనికి తెలుసు – వారికి కూడ తెలుసు.

యూదా మతనాయకులు భయపడలేదు. ఆగకుండా వారు పిలాతుమీద ఒత్తిడి ఎక్కువ చేశారు: "–మాకొక నియమము కలదు; తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెనని అతనితో చెప్పిరి" (యోహాను 19:7).[15] మరో విధంగా చెప్పాలంటే, "దేశద్రోహం విషయంలో అతడు నిర్దోషియైనంత మాత్రాన యిక్కడ పోయిందేమీ లేదు. అతడు చావాలని మేమంటున్నాం, నీవు అతనికి మరణదండన విధించు" అనేది వారి పట్టుదల!

తాను దేవుని కుమారుడనని యేసు చెప్పుకొనినట్టు పిలాతు విన్నప్పుడు (యోహాను 19:7), అతడు "మరి ఎక్కువగా భయపడ్డాడు" (యోహాను 19:8). దేవతలు మానవ రూపు దాల్చినవారని చెప్పే గ్రీకు రోమా పురాణగాధలు అనేకాలున్నాయి (అపొ. 14:11, 12 చూడు). అతడు మరోమారు అధికారమందిరములోనికి ప్రవేశించి, క్రీస్తును తన ఎదుటికి రప్పించుకున్నాడు. "నీవెక్కడనుండి వచ్చితివని" అతడు ఆయన నడిగాడు (యోహాను 19:9ఎ). "నీవు భూలోకం నుండి వచ్చావా లేక పరలోకం నుండి వచ్చావా?

మౌంట్ ఒలింపస్ అనేది దేవతలు నివసించే చోటు." "అయితే యేసు అతనికి ఉత్తరమియ్య లేదు" (యోహాను 19:9బి).

తనకు బదులిమ్మని పిలాతు ఆయనను బలవంతం చేశాడు: "-నాతో మాటలాడవా? నిన్ను విడుదల చేయుటకు నాకు అధికారము కలదనియు, నిన్ను సిలువ వేయుటకు నాకు అధికారము కలదనియు నీవెరుగవా? అని ఆయనతో అన్నాడు" (యోహాన 19:10). అప్పుడు క్రీస్తు తన నోరు తెరిచారు, అయినా పేతురు మనస్సుకు ఊరట కలుగలేదు. "-పైనుండి నీకు ఇయ్యబడియుంటేనే తప్ప నామీద నీకు ఏ అధికారమును ఉండదు" అని క్రీస్తు తేల్చి చెప్పారు (యోహాను 19:11ఎ).

"అందుచేత నన్ను నీకు అప్పగించినవానికి ఎక్కువ పాపము కలదని" యింకను ప్రభువు అన్నారు (యోహాను 19:11బి). కయపకు ఎలాటి అవకాశాలు యివ్వబడ్డాయో పిలాతుకు కూడ యేసును గూర్చి నేర్చుకునే అవే అవకాశాలు యివ్వబడ్డాయి (లూకా 12:48 చూడు). కయపవలె పిలాతు ద్వేషంతో పురికొల్పబడినవాడు కాడు. పిలాతు దోషం లేనివాడేమికాడు (అపో. 4:27 చూడు). కాని ప్రధానయాజకుడును, అతని వలన ప్రభావితం చేయబడిన యూదులును ఎక్కువ దోషమును భరించవలసి యుంటుంది (అపో. 2:23, 36; 3:13-15, 17; 5:28, 30; 7:52; 13:27, 28; 1 థెస్స. 2:14, 15లను చూడు).

తరువాత క్రీస్తును విడుదల చేయలేదు (యోహాను 19:12ఎ; లూకా 23:20ని చూడు). రోమీయుల ప్రమాణం ప్రకారం గాని, యూదుల ప్రమాణం ప్రకారం గాని క్రీస్తు మరణకరణమైన ఏ తప్పిదము చేయలేదు. "ప్రధాన యాజకులు అసూయచేత యేసును అప్పగించిరని పిలాతు తెలిసికొని"[16] (మార్కు 15:10), క్రీస్తును కొట్టించినా వారు శాంతించనందువల్ల, యితర తంత్రాలను ఉపయోగించాలను కుంటాడు.

ఏమి చేయాలో యోచించుకొని, పిలాతు తిరిగి వెలుపలికి వచ్చాడు.[17] అక్కడ వేచియుండిన జనసమూహాన్ని అతడు కనుగొన్నాడు (మార్కు 15:8ఎ). క్రీస్తు మరణాన్ని డిమాండ్ చేస్తున్న మతోన్మాదుల చిన్న గుంపుకాదిది. రోమీయులచే అనుగ్రహింపబడే ప్రత్యేకమైన పస్కాపండుగ కానుకను అడుగవచ్చిన జనసమూహపు గుంపు: ఖైదీని విడుదల చేయడమే ఆ ఉపకారం (మార్కు 15:8; మత్తయి 27:15; యోహాను 18:39).[18] వారు తమ విన్నపాన్ని చేయగా, యేసును విడిపించడానికి పిలాతు మరొక ప్లాన్ యోచించాడు. తాము కోరుకొనిన ఏ ఒక్క ఖైదీనైనా బంధకాల నుండి విడుదల చేయడం సాధరణమైన అలవాటు (మత్తయి 27:15 చూడు). ఈ సారి వారికోర్కె యిద్దరిలో ఒకనికి పరిమితమయింది: తుచ్ఛమైన నేరస్థుడా లేక క్రీస్తు అనబడిన యేసా? ఎవరు కావాలి?

"ఆ కాలమందు బరబ్బ అను ప్రసిద్ధుడైన యొక ఖయిదీ చెరసాలలో ఉండెను"[19] (మత్తయి 27;16). "బరబ్బ" అంటే "అబ్బ కుమారు"దని అర్థం - మరోవిధంగా చెప్పాలంటే [నా] "తండ్రి కుమారుడు."[20] "వీడు పట్టణములో జరిగిన ఒక అల్లరి నిమిత్తమును హత్య నిమిత్తమును చెరసాలలో వేయబడినవాడు" (లూకా 23:19ఎ). పిలాతు యెరూషలేములోని దేవాలయ ధనంతో నీటివనరును కట్టించిన సందర్భంలో

జరిగిన తిరుగుబాటుకు అతడు నాయకుడేమో.[21] బరబ్బ దొంగయు (యోహాను 18:40)[22] హంతకుడునైయుండినవాడు[23] (లూకా 23:19బి). బరబ్బను సమాజములో తిరుగనిస్తే అటువంటి ఖయిదీని జనులు యిష్టపడరని పిలాతు తలంచియుండవచ్చు.

"కాబట్టి జనులు కూడివచ్చినప్పుడు పిలాతు–నేనెవనిని విడుదల చేయవలెనని మీరు కోరుచున్నారు? బరబ్బనా లేక క్రీస్తనబడిన యేసునా? అని వారినడిగెను" (మత్తయి 27:17, 18; మార్కు 15:9ని చూడు). బరబ్బ మీద ఉండే విరక్తి, కొద్ది దినాలకు ముందు క్రీస్తుకు ఉండిన జనాభిమానం అనే ఈ రెండింటిని అధిపతి సరిగా అంచనా వేసినట్టున్నాడు.[24]

ఎవరిని కోరుకోవాలో జనులు తమ మధ్యలో తాము చర్చించుకొంటున్నందున, తాను యూదామత శత్రువులను మించిన తెలివితో మోసగించినట్టు పిలాతు భావించి యుండవచ్చు – కాని అతని ప్రయత్నం విఫలమయింది. అతడు యింకను అక్కడ కూర్చుండియుండగా,[25] "అతని భార్య – నీవు ఆ నీతిమంతుని జోలికి పోవద్దు; ఈ ప్రొద్దు ఆయనను గూర్చి నేను కలలో మిక్కిలి బాధ పడితినని అతని యొద్దకు వర్తమానము పంపెను"[26] (మత్తయి 27:19). దీనితో పిలాతు వ్యాకులపడుతూ న్యాయపీఠం మీద కూర్చుండియున్నాడు (యోహాను 19:8 చూడు).

ప్రధాన యాజకుల యొక్కయు పెద్దల యొక్కయు సమ్మతింపజేయు శక్తిని పిలాతు తప్పుగా అంచనా వేశాడు. బరబ్బను గూర్చి జనసమూహపు భావనను కూడ తప్పుగానే లెక్క కట్టాడు. మానవుడుగా బరబ్బ దోషియే అయినా, తాము ద్వేషించిన రోమీయులతో అతడు, పోరాడినందున, ఆ నేరస్థుడు స్థానిక హీరోగా భావింపబడ్డాడు. ఏదియేమైనా, "ప్రధాన యాజకులును పెద్దలును, బరబ్బను విడిపించుమని అడుగుటకును, యేసును సంహరించుటకును జనసమూహములను ప్రేరేపించిరి" (మత్తయి 27:20).

జన సమూహాలు తమ నిర్ణయం తెలిపినప్పుడు, పిలాతు దిగ్భ్రమ చెంది దిగులు పడియుండవచ్చు: "ఈ యిద్దరిలో నేనెవనిని విడుదలచేయవలెనని మీరు కోరుచున్నారని వారినడుగగా వారు – బరబ్బనే అనిరి" (లూకా 23:18; మత్తయి 27:21). "యేసును విడుదలచేయగోరి వారితో తిరిగి మాటలాడినను వారందరు – వీనిని చంపివేసి మాకు బరబ్బను విడుదల చేయుమని ఏకగ్రీవముగా కేకలు వేసిరి" అందుకు పిలాతు – ఆలాగైతే క్రీస్తనబడిన యేసును ఏమి చేతునని వారినడుగగా – "సిలువ వేయుమని అందరును చెప్పిరి" (మత్తయి 27:22బి; మార్కు 15:12, 13; లూకా 23:21లను చూడు).[27]

వారి మాటలలోని న్యాయాన్ని తిరిగి ఆలోచించమన్నాడు "మూడవమారు అతడు – ఎందుకు? ఇతడు ఏ దుష్కార్యము చేసెను? ఇతనియందు మరణమునకు తగిన నేరమేమియు నాకు అగపడలేదు ..." (లూకా 23:22; మార్కు 15:14ఎ చూడు). అతని శ్రోతలకు న్యాయం కావాలనే అభిలాషయే లేదు: "అయితే వారొకే పట్టుగా పెద్దకేకలు వేసి, వీనిని సిలువవేయుమని అడుగగా ..." (లూకా 23:23ఎ; మార్కు 15:14బి) కడకు వారి కేకలే గెలిచాయి.

దేవుని ప్రజలు[28] దేవుని కుమారుని నిరాకరించారు, అది హృదయాన్ని ఛేదించే దృశ్యం. ఆ దృశ్యాన్ని మనం తిలకించుతూ, "ఆయన్ను మనం సిలువ వేస్తామని" ఎవడు

యిక ఎన్నడు సాహసించలేడని నీవు ఆలోచిస్తూ ఉండవచ్చు! అయినా, విశ్వాసం నుండి తప్పిపోయినవారు "దేవుని కుమారుని మరల సిలువేయుచు బాహాటముగా ఆయనను అవమానపరచుచున్నారని" హెబ్రీ పత్రిక అంటుంది (హెబ్రీ. 6:6). క్రీస్తు శిష్యుడవుగా, నీవెప్పుడైనా నీవీపును ఆయన తట్టు తిప్పి జూచావా? నీవు అలా చేసినట్టయితే, ఆయన చేతులలో కాళ్లలో నీవు తిరిగి మేకులు కొట్టుతున్నట్టే. లోకంతో తిరిగి చేరిపోయేవారిని గూర్చి పేతురు మాట్లాడుతూ, వారి కడపటి స్థితి మొదటి స్థితి కంటె మరి చెడ్డదని తెలిపాడు (2 పేతురు 2:20–22). "నేనాయనను సిలువ వేస్తాన"ని నీ చర్యలలో ఎన్నటెన్నటికిని అనకు.

## పిలాతు: "నేను తటస్థంగా ఉంటాను"
## (మత్తయి 27:24-31; మార్కు 15:15-20;
## లూకా 23:23-25; యోహాను 19:12-16)

క్రీస్తును సిలువ వేయుమని కేకలు వేస్తున్న "వారి కేకలే గెలిచాయి" (లూకా 23:23బి). క్రీస్తు మరణం కంటె మరేదియు యూదులను సంతృప్తి పరచలేదని పిలాతుకు తేలిపోయింది.

(గవర్నరు) అధిపతి వద్ద ప్రతిఘటన యింకా ఏమైనా మిగిలియుంటే. "–నీవు ఇతని విడుదల చేసితివా కైసరునకు స్నేహితుడవు కావు" అని యూదా మత నాయకుల కేకలతో, అది భంగపడింది (యోహాను 19:12బి). ఆ కాలంలో, కైసరు తిబెరియుడు (లూకా 3:1 చూడు).[29] తిబెరికైసరు పరిపాలన చివరి భాగం "అర్థరహితమైన అసూయ, అనుమానము, క్రూరత్వంతో కొనసాగింది".[30] "*maiestas minuta* – రాష్ట్ర భద్రతను అలక్ష్యంచేయుట అనే నేరారోపణతో అనేక మంది అధిపతులు రోముకు పిలువబడిన కాలమది."[31] పిలాతు స్థితి బిగువుగా ఉండిన కారణాన్ని, తనపై యూదులు పద్ధతి ప్రకారమైన ఫిర్యాదు చేయకుండ చూచుకోవలసి యుండింది.[32]

న్యాయపీఠంమీద కూర్చుండి (యోహాను 19:13బి) యేసును పిలిపించాడు. ఆ న్యాయపీఠం "రోము ఆధిపత్యానికి" గురుతు. పిలాతు యేసును బయటికి తీసికొని వచ్చి (యోహాను 19:13ఎ), "ఇదిగో మీరాజు" (యోహాను 19:14సి) అని యూదుల సమూహంతో అన్నాడు. అందుకు వారు – "ఇతనిని సంహరించుము, సంహరించుము, సిలువేయుము అని కేకలు వేసిరి" (యోహాను 19:15ఎ). పిలాతు – "మీ రాజును సిలువేయుదునా? (యోహాను 19:15బి) అని అడుగగా ప్రధానయాజకులు కైసరు తప్ప మాకు వేరొక రాజు లేడనిరి" (యోహాను 19 :15సి)!

ద్వేషము మనస్సును ఆవరించి న్యాయాన్ని నాశనం చేస్తుందనడానికి ఎప్పుడైనా రుజువు కావలసివస్తే, దానికి పరిపూర్ణమైన ఉదాహరణ యిక్కడే ఉంది: "కైసరు తప్ప మాకు వేరొక రాజు లేడా?" దేవుడు ఇశ్రాయేలుకు రాజు కాడా (కీర్తన, 10:16; మత్తయి 5:35)? తమకు రాజుగా ఉండబోయే మెస్సీయ కొరకు వారు ఎదురు చూడలేదా? (జెకర్యా 9:9; మత్తయి 21:5)? కీడుచేయు తలంపును ఆవహించినవారై వేలకొలది

సంవత్సరాలుగా పవిత్రమైన సత్యాలను యూదా మతాధికారులు పూర్తిగా విడిచిపెట్టారు.

ఈ సమయంలో, జనసమూహము – "సిలువవేయుమని మరి ఎక్కువగా కేకలు వేసిరి" (మత్తయి 27:23), ఈలాగు వేయబడే కేకలకు ప్రతి రోమీయుడు భయపడతాడు – "ఎందుకంటె, అట్టి అరుపుల గుండెలో కలహం కాచుకుని ఉంది."[33] కలహం రేగిందంటే, యూదాను పాలించగల పిలాతు సామర్థ్యం ప్రశ్నింపబడుతుంది. తన ఉద్యోగంలో కొనసాగడమో లేక నిర్దోషియైన మనిషిని విడిపించడమో, ఏదో ఒక సంగతి గవర్నరు వెంటనే తేల్చుకోవలసి వచ్చింది. ఇక తీర్మానించడానికి అతడు ఎక్కువ సమయం తీసికోలేదు. యేసును కాపాడలన్న ప్రయాసలనన్నింటిని వదిలివేశాడు (మత్తయి 27:24ఎ).

పిలాతు "నీళ్లు తీసికొని జనసమూహము ఎదుట చేతులు కడుగుకొని – ఈ నీతిమంతుని రక్తమును గూర్చి నేను నిరపరాధిని" అన్నాడు (మత్తయి 27:24సి). సూచన ప్రాయమైన ఆ కార్యము యూదులకు ఎరుకైనదే (ద్వితీయో. 21:1-9; కీర్తన. 26:6; 73:13లను చూడు).[34] బాధ్యత నుండి పిలాతు తన్నుతానే విముక్తుని కావించుకున్నాడు; అయినా వాస్తవమేమంటే, రోమా అధిపతిగా, చివరి నిర్ణయం అతనిదే. తన చేతులలో నుండి మురికిని అతడు కడిగి వేసికోవచ్చుగాని, హృదయంలో నుండి దోషారోపణను అతడు కడిగి వేసికొనలేడు.

"యేసుతో నేనేమి చేతును?" అనే ప్రశ్నకు "నేను తటస్థంగా ఉంటా"నని పిలాతు బదులియ్య ప్రయత్నించాడు. అయితే యింతకు సమస్య ఏమంటే – క్రీస్తును గూర్చి ఎవడును తటస్థంగా ఉండలేడు. "నా పక్షమున నుండనివాడు నాకు విరోధి"యని క్రీస్తు ప్రకటించారు (మత్తయి 12:30ఎ). క్రీస్తును అంగీకరించే తీర్మానం చేసికొనకపోతే, ఆయనను నిరాకరించడానికి తీర్మానం చేసికొన్నట్టే, "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పుతీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" అని క్రీస్తు సంగతిని తేటగా తెలిపారు (యోహాను 12:48). ప్రభువును గూర్చి నీవు నీ తీర్మానం చేసికొనేటప్పుడు, తటస్థంగా ఉండడం ఆశింపదగింది కాదు.

క్రీస్తు మరణం విషయంలో తాను నిర్దోషియని పిలాతు చెప్పుకున్న పిమ్మట, "మీరే చూచుకొనుడని" అతడు జనసమూహంతో చెప్పాడు (మత్తయి 27:24డి). "అందుకు ప్రజలందరు – వాని రక్తము మామీదను మా పిల్లలమీదను ఉండుగాకనిరి" (మత్తయి 27:25). ఆ మాటలతో దేవుని సొంత కుమారుని చంపిన దోషము శాశ్వతంగా తమమీద ఉండునట్లు యూదులు – యిష్టపడ్డారు.[35]

"పిలాతు జనసమూహమును సంతోషపెట్టుటకు మనస్సుగలవాడై" (మార్కు 15:15ఎ), వారడిగినట్టే జరుగవలెనని, పిలాతు తీర్పు తీర్చి, "అల్లరి నిమిత్తమును నరహత్య నిమిత్తమును చెరసాలలో వేయబడినవానిని వారడిగినట్టు వారికి విడుదల చేసి ..." (లూకా 23:24-25ఎ), "యేసును వారికిష్టము వచ్చినట్టు చేయుటకు అప్పగించెను" (25 వ.). అంటే, "యేసును కొరడాలతో కొట్టించి సిలువ వేయుటకు అప్పగించెను" (మత్తయి 27:26బి).[36]

చరిత్ర గమనాన్ని మార్చే అభిప్రాయాన్ని చెప్పిన స్థలాన్ని – "రాళ్లు పరచిన స్థలమును" హెబ్రీ భాషలో "గబ్బతా" అని పిలిచారని యోహాను గుర్తించాడు[37] (యోహాను 19:13సి).[38] "ఆ దినము పస్కాను సిద్ధపరచు దినము" అని అతడు సూచించాడు (యోహాను 19:14ఎ). ఈ సందర్భంలో, సబ్బాతు కొరకైన సిద్ధపాటును అది సూచిస్తుంది. పండుగలోని ఎనిమిదవ రోజు అది వచ్చింది (యోహాను 19:31; మార్కు 15:42; లూకా 23:54 చూడు). ఈ దినాన్ని మాత్రమే కాదు, యోహాను సమయాన్ని గూడా సూచించాడు: "అప్పుడు ఉదయము ఆరు ఘంటలు కావచ్చెను" (యోహాను 19:14బి). యోహాను రోమీయులు లెక్కించే విధానంలో కాలాన్ని సూచించినట్టున్నాడు.[39] ఆ లెక్కప్రకారం, పిలాతు జనసమూహాల యిష్టానికి తన్ను తాను అప్పగించుకున్నది ప్రాతఃకాలంలోనే.

క్రీస్తును సిలువ వేయుమని పిలాతు ఆయనను తన సైనికులకు అప్పగించాడు, ఏర్పాట్లకు సమయం కావాలి (మార్కు 15:25). క్రీస్తు సిలువ వేయబడడానికిని, ఆయనతో పాటు సిలువ వేయబడడానికి ముందుగా నియమింపబడిన మరి యిద్దరికిని[40] సిద్ధపాట్లు చేయవలసియుంటుంది. ఇంతకు ముందు[41] ఆరంభమైన వింతైన "ఆటను" మొదలు పెట్టి సైనికులు కాలం గడిపారు. ఈ సమయంలో, "రాజభవనంలోని" కావలి వారందరు ప్రభువును అపహసించారు (మార్కు 15:16–19; LB ; మత్తయి 27:27–30ని కూడా చూడు).

చివరిగా, సిలువ వేయడానికి సమస్త ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. "ఆయనను అపహసించిన తరువాత ఆయన మీదనున్న ఆ అంగీని తీసివేసి ఆయన వస్త్రములాయనకు తొడిగించి, సిలువ వేయుటకు ఆయనను తీసికొని పోయిరి" (మత్తయి 27:31).

## ముగింపు

మన రెండు పాఠాల గమనంలో, "యేసుతో నేనేమి చేతును?" అనే ప్రశ్నకు పలు జవాబులు చెప్పారు:

- యూదా: "నేనాయనను అమ్ముకుంటాను."
- పేతురు: "నేనాయనను ఎరుగనంటాను."
- సన్‌హెడ్రిన్: "మేమాయనను నిందిస్తాం."
- హేరోదు: "నేను కేవలం కుతూహలంగా ఉంటాను."
- జనసమూహం: "మేమాయనను సిలువ వేస్తాం!"
- పిలాతు: "నేను తటస్థంగా ఉంటాను."

ఆ ప్రజలు ఎందుకు అలా స్పందించి యుంటారు? యూదా అపవాదికి అప్పగించు కున్నాడు (లూకా 22:3; యోహాను 13:27). పేతురు భయానికి లొంగిపోయినట్టున్నాడు. సన్‌హెడ్రిన్ అసూయకు పరపక్షద్వేషానికి లోబడ్డారు (మార్కు 15:10). హేరోదు భక్తి హీనమైన తత్వానికి లొంగిపోయాడు. జనసమూహము తమ్మును వెంటాడిన నాయకుల వశమయ్యారు. పిలాతు జనుల మెప్పుకు లొంగిపోయాడు (మార్కు 15:15).[42]

విషాదకరంగా, వారిలో ఎవరును దేవునికి తమ్మును తాము అప్పగించుకొనలేదు (రోమా. 6:13, 16ను చూడు; KJV).[43]

"యేసుతో నేనేమి చేతును?" అనే ప్రశ్నకు నీవు ఏ జవాబు యివ్వాలి? నీ ఆత్మను రక్షించి నీ జీవితాన్ని ఏ జవాబు దీవిస్తుంది? "మేము ఆయనను అంగీకరిస్తాం, మేమాయనకు లోబడతా"మని పెంతెకొస్తు దినాన ఆ మూడువేల మంది యిచ్చిన జవాబు రైటు! (అపో. 2:37, 38, 41).

"యేసుతో నేనేమి చేతును?" అనే ప్రశ్నకు జవాబు చెప్పవలసిన నీ సమయం వచ్చింది. నీవు ప్రభువుకు అప్పగించుకోవాలని నా ప్రార్థన – పెంతెకొస్తు దినాన ఆ మూడు వేలమంది యూదులు యిచ్చిన జవాబే నీ జవాబై యుండాలి. దేవుని కుమారునిగా ఆయనను అంగీకరించి ఆయన చిత్తాన్ని జరిగించు!

## నోట్సు

పిలాతు శీలాన్ని గూర్చి ప్రసంగించవచ్చు: "బాధ్యతలను మార్చ ప్రయత్నించిన వ్యక్తి." నేడు అనేకులు తమ బాధ్యతల విషయంలో "చేతులు కడిగివేసికొంటారు" – తమ్మును తప్ప ప్రతిదానిని ప్రతివారిని బాధ్యులుగా ఎంచుతుంటారు – వారి తప్పులకు లేక వారి దోషాలకు: సమాజాన్ని, తల్లిదండ్రులను – వారి సమభాగస్థులను, చెడ్డ స్నేహితులను, వగైరా, వగైరాలను. పిలాతు మీద కావలసినంత విషయం ఈ ప్రసంగాల్లో, సప్లమెంటరీ స్టడీలోను ఉంది.

పిలాతు మీద Neal Pollard ఒక ప్రసంగం తయారు చేశాడు: "పిలాతు తప్పులు"[44] అతడు నాలుగు తప్పులను ప్రస్తావించాడు:(1) పిలాతు బాధ్యతలను యితరుల మీద పెట్టాడు (లూకా 23:5–7), (2) దుష్టత్వంతో రాజీపడగోరాడు (లూకా 23:13–16), (3) పరిస్థితులలో నుండి తన చేతులు కడుగుకోవాలనుకున్నాడు (మత్తయి 27:24) (4) అతడు వదిలి పెట్టాడు (మత్తయి 27:26). దీనికి నీవు యింకా పాయింట్లు చేర్చవచ్చు:

చివరి ఐడియా: "ఇదిగో ఈ మనుష్యుడు!" (యోహాను 19:5) ప్రభువైన యేసును ఘనపరచడానికి దీన్ని ప్రసంగ సూత్రంగా వాడుకోవచ్చు.

---

సూచనలు

[1]పిలాతు యెరూషలేములో ఉన్నది శాంతి భద్రతలను కాపాడడానికి. హేరోదు యూదులను ఇంప్రెస్ చేయడానికి ఉన్నాడు. [2]"అంతిప హేరోదు" తో మంచిగా ఉండడం పిలాతుకు మేలే. చక్రవర్తియైన తిబెరయ హేరోదు మాట వింటాడు [Josephus *Antiquities of the Jews* 18:2. 3; 18.4.5.] (Bruce Corley, "Trial of Jesus," *Dictionary of Jesus and the Gospels*, eds. Joel B.Green and Scot McKnight [Downers Grove, Ill.: InterVarsity Press, 1992], 848). పిలాతును గూర్చి అనుబంధపు పాఠం చూడు. [3]యేసుని ఎక్కడికి తీసుకొని వెళ్లిరో ఖచ్చితంగా మనకు తెలియదు. అంతోనియా కోటలో ప్రెటోరియంవారు ఉండియుంటే, హేరోదు అంతిపా తన తండ్రి కట్టించిన రాజు భవనం ఉన్నట్టయితే. మహా పేరోదు యొక్క రాజు భవనం పిలాతు యొక్క ప్రెటోరియం అయినయెడల హేరోదు అంతిపా ఎక్కడ ఉన్నాడో మనము ఎరుగము. [4]ప్రాచీన రాజుల దగ్గర విదూషకులు ఉండేవారు. వీరిని కోర్ట్

“ఫూల్స్” అనేవారు. ఉల్లాస పరచడానికి వారు అనేక పద్ధతులను వినియోగించేవారు: తమాషాలు, రోతైన పాటలు, నటనలు చేస్తూండేవారు. [5]ఆయనకు తొడిగించిన అంగీ (లూకా 23:11) హేరోదు పాత అంగీయై యుండవచ్చు. ఆయనను హేళన, ఎగతాళి చేయడానికి తొడిగియుంటారు. [6]క్రీస్తుకు కనుపరచిన మర్యాదకు అపొ. 4:27 హేరోదును నేరస్థునిగా ఎంచుతుంది. [7]కడకు, హేరోదు ఆయనకు దండన విధింప లేదు తిరిగి పిలాతునొద్దకే ఆయనను పంపాడు. [8]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., “*paideuo,*” *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1996), 97.

[9]కొరడాలతో కొట్టింది ఎప్పుడో నిశ్చయంగా తెలియదు. [10]J. W. Shepard, *The Christ of the Gospels* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1939.) 589.

[11]ఈ ముండ్ల కిరీటం దేనితో చేయబడిందో మనకు తెలియదు. రెండు అంగుళాల పొడవుగల ముండ్లతో చేయబడిందంటారు. ఏ విధమై ముండ్లు ఉపయోగించి చేసిన అది ఎక్కువైన బాధను కలిగిస్తుంది. [12]హేరోదు క్రీస్తుకు తొడిగిన అంగీ “శోభాయమానమైన” అంగీయైయుండ వచ్చు. లేక సైనికులు తీసివేసిన అంగీయైయుండవచ్చు. [13]ఈ “మనుష్యుడు” అని ఉపయోగించిన పదం ప్రాముఖ్యతను సంక్రమించుకొని యుండవచ్చు. పిలాతు క్రీస్తును “రాజు” అంటూ పరిచయం చేస్తాడు (మార్కు 15:9, 12; యోహాను 18:39). [14]గ్రీకులో “నీకు”, “నా” అనేవి ఒత్తి పలకబడింది. [15]రాజ ద్రోహమనే నేరారోపణకు యూదుల నాయకులు తిరిగి వచ్చారు (యోహాను 19:12). [16]క్రీస్తు విజయోత్సవంతో పట్టణంలో మంగళవారం ప్రవేశించుటకు యిది సూచింపబడియుండవచ్చు. [17] కొద్దిసేపు యేసును బంధిగా లోపల ఉంచి యుండవచ్చు (యోహాను 19:13). [18]“పస్కా పండుగ సమయమున నేనొకని మీకు విడుదల చేయుట వాడుక కలదు గదా” అని పిలాతు అనడంలో యిది అతడు ఆరంభించలేదేమోననిపిస్తుంది (యోహాను 18:39ఎ). దీనికి చరిత్ర ఆధారం ఏమీ లేదు. [19]ప్రాచీన ప్రతి ఒకదానిలో, అతని పూర్తి పేరు “యేసు బరబ్బ” అని ఉంది. అందువలనే కాబోలు యేసును గూర్చి పిలాతు మాట్లాడినప్పుడు “క్రీస్తు అనబడిన యేసు” అని అన్నాడు. [20]“అబ్బా” అంటే నాయనా.

[21]పిలాతును గూర్చిన అనుబంధపు పాఠాన్ని చూడు. [22]“బందిపోటు దొంగ” అనేది తెలుగు తర్జుమా. [23]తిరుగుబాటు సమయంలో ఒకవేళ అతడు రోమాసైనికులను చంపియుండవచ్చు. [24]విజయోత్సవపు ప్రవేశంలో క్రీస్తు ఘనపరచబడ్డారు. [25]ఆయన “న్యాయ పీఠము మీద” గూర్చుండియున్నట్టు మత్తయి 27:19 చెప్పుతుంది. “న్యాయ పీఠము” అనే పదం bema అనే పదంనుండి వచ్చింది, అధికార్లు తీర్పును ప్రకటించే ఎత్తయిన స్థలాన్ని సూచిస్తుంది. (“కార్య గ్రంథం భాగం 4”లో *bema* అనే ప్రయోగం అపొ. 18:12లోని వాక్యం పై నోట్సును చూడు). [26]మూఢ నమ్మకంగల అవిశ్వాసులు కలలకు ఎక్కువ ప్రాముఖ్యతను యిస్తుంటారు అందువలన మనము కూడ అలా యివ్వాలని దాని అర్థం కాదు. అద్భుతాలు జరుగుతున్న కాలంలో, దేవుడు తన ప్రజలకు వర్తమానాన్ని అందించడానికి కొన్నిసార్లు కలలను ఉపయోగించాడు. పిలాతు భార్యకు కలిగిన కల దైవ ధర్శనము వలన కలిగినదై కాకపోవచ్చు. ఎందుకనగా ఆమె యేసుని “నీతిమంతుడని” ముందుగా ఎరిగి యుండెను. అందువలన రోమా సైనికులు యేసును బంధించుటకు సిద్ధపడియున్న విషయాన్ని ఎరిగిన ఆమెకు ఆ రాత్రి భయంకరమైన దృశ్యం కలిగియుండవచ్చు. [27]వారములో మొదటి దినాన జన సమూహం “హోసన్నా” అని కేకలు వేసి ఉంటారని, ఐదు రోజుల తరువాత “సిలువేయుమని” కేకలు వేసినట్లు సువార్తికులలో అనేకులు గుర్తించారు. ఇది ప్రజల స్థిరబుద్ధిలేని స్థితిని చూపిస్తుంది. కాని మనం గుర్తించవలసిన విషయం ఏమిటంటే ఆదివారమున స్తుతిచేసిన ఆ ప్రజలే సిలువవేసిన శుక్రవారమందు ఉండనవసరం లేదు. పండుగకు వేలాది ప్రజలు యెరూషలేమునకు వచ్చి యుండిరి. [28]అనేక వేలాది సంవత్సరములనుండి ఇశ్రాయేలీయులు దేవునిచే ఏర్పరచబడిన జనులై యుండిరి. [29]తిబేరియా పై వివరాలకు “క్రీస్తు జీవితం, 1”ని చూడు. [30]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 717.

[31]A. N. Sherwin-White, “Pilate, Pontius,” *The International Standard Bible Encyclopedia*, rev., gen. ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:868. [32]పిలాతుని భయము పాతుకొని పోయి యుండెను. కొద్ది సంవత్సరాలు అయిన తరువాత కంప్లెయింట్ చేయగా అతని స్థానమునుండి విడిపించిరి. పిలాతు పైనున్న అనుబంధపు పాఠాన్ని చదువు. [33]Walter Wangerin, Jr., *The Book of God: The Bible as a Novel* (Grand Rapids., Mich.: Zondervan Publishing House, 1996), 801. [34]అమెరికాలో ఇంకా “ఈ విషయం పై నేను నా చేతులను కడుగుకున్నాను” అను ప్రయోగం ఉంది. “ఈ విషయంలో నాకు జోక్యం లేదు” అని దాని అర్థం, అంటే “ఇక ముందు జరిగేవాటి

విషయములో నా తప్పిదమేమి లేదు" అని అర్థం. [35]కొన్నిసార్లు మనలో అనేకులం ఏదో ఒక రకంగా క్రీస్తుని సిలువ వేసి అవమానానికి అప్పగించాం (హెబ్రీ. 6:6ను చూడు). యూదులు లేక అన్యులు, మనమందరము పాపము చేసియున్నాము, దేవుని కృప మనకు అవసరం (రోమా 3:23). [36]"అప్పుడు సిలువ వేయబడుటకై అతడాయనను వారికి అప్పగించెను" అని యోహాను 19:16లో ఉంది. సందర్భాన్ని బట్టి, "వారు" అనే పదం యాజకులను సూచిస్తుంది. అయితే, యూదులైన యాజకులు యేసును సిలువ వేసిన వారు కారు. పిలాతు ఈ నాయకుల చేతికి అప్పగించాడని దాని అర్థం. [37]"గబ్బతా" అనగా "హెచ్చింపబడిన స్థలం." దాదాపుగా *bema* అనే పదానికున్న అర్థమే దీనికి ఉంది. [38]ఈ రాళ్లు పరచిన స్థలం ఎక్కడుందో తొలి చదవరలు ఎరిగియుండియుండవచ్చు. క్యాస్ల్ అంటోని ఉన్న రాళ్లు పరచిన స్థలమును పురావస్తు శాస్త్రులు కనుగొన్నారు. కొందరైతే ఈ స్థలం హేరోదు రాజభవనంలో ఉందని నమ్ముతారు (ప్రెటోరియమును గూర్చిన చర్చను చూడు). [39]యెరూషలేము నాశనము తరువాత రోమా కాలమాన ప్రకారం యోహాను సువార్త యితర మూడు సువార్తల రచనలకంటె కొన్ని శతాబ్దాలకు తరువాత రాయబడింది ("క్రీస్తు జీవితం, 1"ని చూడు). యూదుల కాలమాన ప్రకారం ఒక క్రొత్త దినం సూర్యాస్తమందు ప్రారంభమవుతుంది, రోమా కాలమాన ప్రకారం నేడు మనం లెక్కించే విధముగా మధ్య రాత్రియందు ఆరంభమవుతుంది. యూదుల కాలమానాన్ని ఉపయోగించిన మార్కు, యేసును సిలువ వేసినప్పుడు పగలు తొంమిది గంటలని చెప్పాడు (మార్కు 15:25). యూదుల కాలమానాన్ని ఉపయోగించిన మత్తయి, మధ్యాహ్నం మొదలుకొని మూడు గంటల వరకు ఆ దేశమంతటను చీకటి కమ్మెను అని అంటాడు (మత్తయి 27:45; మార్కు 15:33; లూకా 23:44)–తరువాత యేసు చనిపోయారు (మత్తయి 27:46–50; మార్కు 15:34–37; లూకా 23:44–46). యోహాను ఉపయోగించిన ఆరవ గడియ రోమా కాలమానాన్ని ఉపయోగించినట్టుంది. [40]పిలాతు ఉదయం ఆరు గంటలకు యేసుకు తీర్పు తీర్చాడు (యోహాను 19:14 పై నోట్సును చూడు). ఆ తీర్పుకు సిలువ వేయుటకు మధ్య కొన్ని గంటలు గడిచి పోయాయి. ఈ సమయము అవసరమైన సిద్ధపాటుకు ఉపయోగించబడింది.

[41]ఈ ఆటకు చేర్చబడిన మరొక విషయం ఏమనగా, యేసును కొట్టేకు ముందుగా యేసుకు బదులుగా మరొక దానిని ఉపయోగించారు (మత్తయి 27:30). [42]The idea of yielding to a variety of pressures comes from Warren W. Wiersbe, *The Bible Exposition Commentary,* vol. 1 (Wheaton, Ill.: Victor Books, 1989), 101. [43]తరువాత పేతురు దేవునికి లొంగిపోయాడు, జనసమూహములో కొంతమంది పెంతెకొస్తు దినమున విధేయులైయ్యారు. [44]Neal Pollard, "Pilate's Mistakes," *Vigil* (November-December 2001): 53-54.

---

## సిలువ చెంత

గొల్గొతా మార్గంలో, యేసు తన సొంత బాధను గూర్చి మాట్లాడలేదు, కాని యితరుల విపత్తులను గూర్చి మాట్లాడారు (లూకా 23:28–31). మనలో ఎక్కువ మందిమి దీనికి వ్యతిరేకంగా ఉంటాం: ఫిర్యాదు చేయ త్వరపడతాం, ఆదరించడానికి నిదానిస్తాం. మనకు బాధ కలిగినప్పుడు మాట్లాడతాం, యితరులకు కలిగినప్పుడు మౌనంగా ఉండి పోతాం.

David Roper

"దైవికమైన ప్రేమ, అపవాది ద్వేషము; ఉన్నతమైన దేవుని ఉద్దేశాలు, నీచమైన మానవ ఉద్దేశాలు; సిలువచుట్టు కలిసి మిళితమైయున్నాయి."

"An Outline of New Testament History"
B.S. Dean